సాక్షి
జనగామ

బుధవారం | 16 | అక్టోబర్ | 2024



రామప్ప ఖ్యాతి ప్రపంచానికి చాటాలి

-10లో▸

రామప్ప ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని ములుగు కలెక్టర్ దివాకర పిలుపునిచ్చారు.



మార్కెట్‌లో అంతర్గత బదిలీలు

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులను బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

-10లో▸

గరిష్టం/కనిష్టం
32⁰ /24⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రి చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పొడిగింపు

జనగామ రూరల్: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి డాక్టర్ బి.విక్రమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను ఈ పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి ఈ నెల 29 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్‌గా అమ్జద్ అలీ



జనగామ: జనగామ సబ్ రిజిస్ట్రార్‌గా అమ్జద్ అలీ నియమిస్తూ రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ సెక్రటరీ జ్యోతి బుద్ధప్రకాష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్న రామకృష్ణ ఖమ్మంకు వెళ్లనుండగా...స్టేషన్‌ఘన్‌పూర్‌లో పని చేస్తున్న అమ్జద్ అలీ ఇక్కడకు రానున్నారు. ఈ మేరకు నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

జిల్లా సంక్షేమ అధికారిగా ఫ్లోరెన్స్



జిల్లా సంక్షేమ అధికారి (డీ డబ్ల్యూ ఓ)గా దోర్నాల ఫ్లోరెన్స్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న జయంతి హనుమకొండ జిల్లాకు ఏడీగా పదోన్నతిపై వెళ్లగా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పని చేస్తున్న సీడీపీఓ ఫ్లోరెన్స్‌కు జిల్లా అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు కార్యాలయ ఉద్యోగులు, అంగన్ వాడీ టీచర్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్క అరుణ, జిల్లా అధ్యక్షురాలు కోమల్ల ఎల్లమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రేణుక, ప్రాజెక్టు అధ్యక్షురాలు అనిత, రజిత తదితరులు ఆమెను సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు.

రేపు వాల్మీకి జయంతి

జనగామ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 17వ తేదీన మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయం (ఐడీఓసీ)లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

17న సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు

జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపికలు ఈనెల 17వ తేదీన స్థానిక ప్రిస్టన్ హైస్కూల్ మైదానంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.భగత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని, 1.1.2010 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 9848910545, 98496 83470 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్



నర్మెట: కాంగ్రెస్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన వలబోజు శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనావాస్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, నూకల బాల్ రెడ్డి, గొల్లపల్లి బాలచందర్, తీగుళ్ల భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అధ్యాపకుల నిరసన ర్యాలీ



జనగామ రూరల్: డిగ్రీ అధ్యాపకుల నిరవధిక బంద్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని అధ్యాపకులు కళాశాల నుంచి చౌరస్తా వరకు నిరసన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి ఫీజు రియింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందన్నారు. జీతాలు ఇవ్వలేక బిల్డింగ్ రెంట్‌ను చెల్లించకలేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైన వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

దసరా ధమాకా!

ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఆదాయం రూ.28.99 కోట్లు

- తిరిగిన కిలో మీటర్లు 50 లక్షలు
- ఆక్యుపెన్సీ రేషియో 91 శాతం

హన్మకొండ: సద్దుల బతుకమ్మ, దసరా పండుగను ఆర్టీసీ సద్వినియోగం చేసుకుంది. రోజూ నడిచే బస్సులతోపాటు ప్రత్యేక సర్వీసులను నడపడం ద్వారా మరింత ఆదాయం సంపాదించుకుంది. ఈనెల 1 నుంచి 14వ తేదీ వరకు వరంగల్ రీజియన్‌లో టీజీఎస్ ఆర్టీసీ రూ.28.99 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకుంది. 14 రోజులపాటు 50 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరిగాయి. 91 శాతం ఆక్యుపెన్సీ రేషియో ద్వారా కిలోమీటర్‌కు రూ.58 ఆదాయం పొందింది. బతుకమ్మ, దసరా పండుగకు విద్యాసంస్థలు సెలవులు ఇచ్చినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీని బట్టి ప్రైవేట్ వాహనాలకు అవకాశం ఇవ్వకుండా సంస్థ వివిధ రూట్లకు సర్దుబాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంది.



డిపోల వారీగా ఆదాయం వివరాలు

	హనుమకొండ	జనగామ	వరంగల్–1	వరంగల్–2	మానుకోట	నర్సంపేట	పరకాల	తొర్రూరు	భూపాలపల్లి
ఆదాయం	373.22	338.69	467.24	393.18	203.02	284.87	223.94	329.99	285.47
కిలోమీటర్లు	6.72	6.16	7.82	7.16	3.46	4.92	3.79	5.22	4.75
ఈపీకే	55.50	54.97	59.76	54.95	58.61	57.89	59.15	63.27	60.07
ఓఆర్	81	94	83	86	103	96	98	104	97

- ఆదాయం (రూ.లక్షల్లో) • తిరిగిన కిలోమీటర్లు (లక్షల్లో)
- ఎర్నింగ్స్ పర్ కిలోమీటర్ (ఈపీకే) రూ.లలో • ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) శాతంలో

అత్యధిక ఆదాయం వరంగల్–1 డిపో

- పండుగ రోజుల్లో వరంగల్–1 డిపోకు అత్యధికంగా రూ.467.24 లక్షలు ఆదాయం వచ్చింది.
- అతి తక్కువగా మహబూబాబాద్ డిపో రూ.203.02 లక్షలు ఆదాయం సాధించింది.
- వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో ఆక్యుపెన్సీ రేషియోలో తొర్రూరు డిపో 104 శాతంతో అగ్రభాగాన నిలవగా.. మహబూబాబాద్ డిపో 103 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది.
- హనుమకొండ 81శాతం ఆక్యుపెన్సీ రేషియోతో చివరి స్థానంలో ఉంది.
- తొర్రూరు డిపో కిలోమీటర్‌కు రూ.63,27 ఆదాయం రాబట్టి కిలో మీటర్ లెక్కన వరంగల్ రీజియన్‌లో అగ్రభాగంలో నిలిచింది.
- భూపాలపల్లి డిపో కిలోమీటర్‌కు రూ.60.07 ఆదాయాన్ని పొంది రెండో స్థానంలో నిలిచింది.
- వరంగల్–1 డిపో 7.82 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి మొదటి స్థానంలో నిలవగా.. 7.16 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి వరంగల్–2 రెండో స్థానంలో నిలిచింది.

కల నెరవేరిన వేళ..

నూతన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ పూర్తి

- ఆర్డర్ కాపీల అందజేత
- జిల్లాలో 221 పోస్టులు, 199 మంది ఎంపిక
- ఇద్దరు టీచర్ల ఆర్డర్ పెండింగ్

జనగామ: టీచర్ కొలువు చేయాలనే ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. టెట్ కోసం అహోరాత్రులు కష్టపడి అర్హత సాధించిన అభ్యర్థులు... డీఎస్సీలో ఉత్తమ ర్యాంకులు సాధించి ఉపాధ్యాయులుగా భావితరాలకు విద్యాబోధన చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఆగస్టులో డీఎస్సీ నిర్వహించగా... అక్టోబర్ 1న ఫలితాలను వెల్లడించిన సంగతి తెలిసిందే. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో డీఈఓ ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో ల్యాంగ్వేజ్ పండిట్ హిందీ, తెలుగు, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, స్పెషల్ ఎడ్యుకేషన్ కేటగిరీల్లో 221 పోస్టులు ఖాళీ ఉండగా, 199 మందిని ఎంపిక చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, బీసీ (ఏ), స్పెషల్ ఎడ్యుకేషన్ తదితర విభాగాల్లో అర్హత కలిగిన వారు లేకపోవడంతో 22 పోస్టులు మిగిలిపోయాయి. ఇందులో ఇద్దరికి సంబంధించి దివ్యాంగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం హైదరాబాద్‌కు పంపించడంతో... 197 మంది టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్లు బి.శ్రీనివాస్ (జిల్లా కోర్డినేటర్), గౌసియా బేగం, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బి.నర్సింగరావు, హెచ్‌ఎంలు రవికుమార్, చంద్రభాను స్టాటికల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్లు ఎండీ హుస్సేన్, తదితరులు ఉన్నారు.



ఆర్డర్ కాపీ అందిస్తున్న డీఈఓ రామ్, అధికారులు

కౌన్సెలింగ్ పరిశీలన

జనగామ కలెక్టరేట్‌లో చేపట్టిన నూతన టీచర్ల కౌన్సెలింగ్ ప్రక్రియను డీఈఓ రామ్‌తో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పరిశీలించారు. కౌన్సెలింగ్ తీరును పరిశీలించి, నూతన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అంతకు ముందు నూతన టీచర్లు డీఈఓకు స్వీట్లు తినిపించగా, ఆర్డర్ కాపీ అందుకున్న వారు సంబురాలు నిర్వహించుకున్నారు.

ఆర్డర్ కాపీల అందజేత

జిల్లాలో నూతన ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి.. ర్యాంకుల ఆధారంగా ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను కేటాయించారు. స్కూల్ అసిస్టెంట్, ల్యాంగ్వేజ్ పండిట్ హిందీ, తెలుగు, స్పెషల్ ఎడ్యుకేషన్, ఎస్జీటీలకు సంబంధించి కౌన్సెలింగ్ పూర్తి చేసి, సాయంత్రం ఆర్డర్ కాపీలను అందజేశారు. ఎస్జీటీ



కౌన్సెలింగ్‌కు హాజరైన నూతన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు ఎంఈఓ లేదా కాంప్లెక్స్, స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయులకు నేడు (బుధవారం) రిపోర్టు చేయాలని డీఈఓ తెలిపారు.

ఉత్కంఠ

టీచర్‌గా అర్హత సాధించి... పోస్టింగ్ కోసం కలెక్టరేట్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు వచ్చిన నూతన ఉపాధ్యాయులు ఉత్కంఠగా ఎదురుచూశారు. ర్యాంకు ఆధారంగా ఖాళీగా ఉన్న పాఠశాలలను పరిశీలిస్తూ... దగ్గర, దూర భారంపై లెక్కలు వేసుకున్నారు. కౌన్సెలింగ్ పూర్తై ఆర్డర్ కాపీ చేతిలోకి వచ్చే సరికి నూతన ఉపాధ్యాయులు ఆనందాలకు అవధులు లేకుండా పోయింది.

ఏడాది నుంచి ప్రిపేర్ అవుతున్న..



ప్రస్తుతం దేవరుప్పుల ఎమ్మార్సీలో ఐఆర్పీగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న. డీఎస్సీ కోసం ఏడాది కాలంగా ప్రిపేర్ అవుతూ, ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకున్న. డీఎస్సీలో జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించా. కౌన్సెలింగ్‌లో ఊరికి దగ్గరగా తరిగొప్పుల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పనిచేసే భాగ్యం దక్కింది.

– గోపగోని సంధ్య, జిల్లా మొదటి ర్యాంకర్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్, నర్మెట

కష్టపడి చదివా..



జిల్లాలోని బచ్చన్నపేట కేజీబీవీలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేయగా, కష్టపడి చదువుకుని పెంబర్తి ఎంజేపీ (గురుకులం)లో టీచర్‌గా ఉద్యోగం సంపాదించా. 2018 నుంచి డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నా. ఈ రోజు నా కల నెరవేరింది. బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ ఉన్నత పాఠశాలకు పోస్టింగ్ వచ్చింది. నాన్న పాపయ్య ఉంటే చాలా గర్వపడేవారు.

– ఉల్లెంగుల మౌనిక, జనగామ, స్కూల్ అసిస్టెంట్

డీఎస్సీ కోసం కొట్లాడినం..



డీఎస్సీ కోసం గత ప్రభుత్వ పాలన నుంచి కొట్లాడుతున్నం. ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి వినతులు ఇవ్వడం, ఆందోళనలు చేశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మా కల నెరవేరింది. నాలుగు నెలల ప్రిపరేషన్‌తోనే 74వ ర్యాంకు సాధించి నేడు టీచర్‌గా బాధ్యతలను స్వీకరించబోతున్న.

– రావుల రామ్మోహన్‌రెడ్డి, డీఈడీ, బీఈడీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

బీసీ గురుకులాలకు తాళం!

అద్దె చెల్లించడం లేదని గేట్లకు తాళం వేసిన యజమానులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36 గురుకులాలు అద్దె భవనాల్లోనే..
- ఏడు మాత్రమే సొంత భవనాల్లో..
- మార్చినుంచి ఇప్పటి వరకు చెల్లించని అద్దె
- ప్రతీనెల చెల్లించాల్సింది రూ. 74లక్షల నుంచి రూ.75లక్షల వరకు

సాక్షిప్రతినిధి, వరంగల్/విద్యారణ్యపురి: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాలకు తాళం పడింది. ఇప్పటికే అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా మరోవైపు నెలల తరబడి అద్దె చెల్లించకపోవడం.. దసరా సెలవులు ముగియడం.. మంగళవారంనుంచి విద్యార్థులు రాక ప్రారంభంకావడంతో మొదటిరోజే అద్దెభవనాల యజమానులు పాఠశాల గేట్లకు తాళం వేసిన నిరసన తెలిపారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గంటల తరబడి గేటు బయటే పడిగాపులు కాశారు. కొన్నిచోట్ల ప్రిన్సిపాళ్లు యజమానులకు నచ్చజెప్పినట్లు తెలుస్తోంది. సమస్య తీవ్రత ఎక్కువగా ఉండడంతో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పరిష్కరించేశగా ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం.

మూడో భాగం గురుకులాలు అద్దె భవనాల్లోనే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 43 వరకు మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాలు ఉన్నాయి. ఇందులో ఏడు గురుకులాలకు ప్రభుత్వ భవనాలు ఉండగా, మిగతా 36 అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. వీటికి ప్రతీనెల రూ.74లక్షలనుంచి రూ.75 లక్షల వరకు ప్రభుత్వం అద్దె చెల్లించాల్సింటుంది. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు అద్దె చెల్లించడం లేదు. ఆయా యాజమాన్యాలు తమకు అద్దెబిల్లులు చెల్లించాలని పలుసార్లు కోరినప్పటికి ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో చివరికి దసరా సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే రోజు (మంగళవారం) గురుకులాల గేట్లకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ విషయమై అద్దెభవనాల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడితో ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ ఎం.రాజ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. అద్దె బకాయిలు చెల్లించేందుకు సంబంధిత ఉన్నతాధికారులు యత్నిస్తున్నారని, బిల్లులు వస్తాయని,సహకరించాలని తెలియజేసినట్లు రాజ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ఉన్నతాధికారులు కూడా సంబంధిత అద్దె యాజమాన్యాలతో మాట్లాడినట్లు సమాచారం. ఆ తరువాత కొంతవరకు సమస్య సద్దుమణిగి యజమానులు గేట్లకు తాళాలు తీసినట్లు తెలిసింది.



వరంగల్ ఉర్సు గుట్ట గురుకుల (బాలికల) పాఠశాల, కళాశాల గేటు తాళం వేసిన యజమాని కుమారస్వామి, గేటు వద్ద నిరీక్షిస్తున్న సిబ్బంది, ఉపాధ్యాయులు

జిల్లాల వారీగా బీసీ గురుకులాలు ఇలా..

జిల్లా	మొత్తం	సొంత భవనాలు	అద్దె భవనాలు
జేఎస్‌భూపాలపల్లి	05	02	03
హనుమకొండ	12	04	08
వరంగల్	07	00	07
జనగామ	07	01	06
ములుగు	03	01	02
మహబూబాబాద్	06	00	06

ములుగు జిల్లాలో మంజూరైన 3 గురుకులాలను అక్కడ ఏర్పాటు చేయకుండా ఒకటి హనుమకొండ జిల్లా శాయంపేటలో, వరంగల్ జిల్లాలో ఆరెపల్లిలో మరొటి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో ఒకటి ఏర్పాటు చేశారు.

డిగ్రీ కళాశాలలు ఇలా..

బీసీ గురుకులాల్లో మహబూబాబాద్ జిల్లాలో రెండు డిగ్రీ కళాశాలలు, జనగామలో ఒకటి, భూపాలపల్లిలో ఒకటి అద్దె భవనాల్లో ఉన్నాయి. హనుమకొండ జిల్లా కాజీపేటలో మహిళలకు లా కాలేజీ, ములుగు జిల్లాకు మంజూరైన డిగ్రీ కాలేజి కూడా లా కాలేజీ సొంత భవనంలోనే నడుపుతున్నారు.

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు

- వివరాలు 10లో▸

- అద్దె చెల్లించలేదని గురుకులాల గేట్లకు తాళం
- భవన యజమానుల నిరసన

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం, ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల వివరాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జనగామ అడిషనల్ డీఆర్‌డీఓ చంద్రశేఖర్ అన్నారు. మండలంలో త్వరలో నేషనల్ లెవల్ మానిటరింగ్ కేంద్ర బృందం పర్యటన ఉన్న నేపథ్యంలో మండలంలోని తాటికొండ, చాగల్లు, నమిలిగొండ, పాంనూర్, అక్కపెల్లిగూడెం గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీఓ మాట్లాడుతూ నేషనల్ లెవల్ మానిటరింగ్ కేంద్ర బృందం పర్యటన ఉన్నందున ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలు, రిజిస్టర్లు, రికార్డులను సక్రమంగా ఉండాలని సూచించారు. అందరూ అప్రమత్తంగా, బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ ప్రాజెక్టు అధికారి వీరన్న, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంపీఓ నర్సింగరావు, ఈజీఎస్ ఏపీఓ ప్రేమయ్య, ఈసీ కిరణ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విభాగం: సీపీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తునట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది పలు వ్యక్తిగత సమస్యలతో పాటు, శాఖాపరమైన సమస్యలతో బాధపడుతున్నట్లుగా సీపీ దృష్టికి రావడంతో సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ సిబ్బందికి వ్యక్తిగతంగా, శాఖాపరమైన సమస్యలుంటే నోడల్ అధికారి మహిళా ఏఎస్ఐ జ్యోతి ప్రియాంకకు 99486 85494 ద్వారా తమ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. పోలీస్ సిబ్బంది తనను ప్రత్యక్షంగా కలిసి సమస్యలు తెలిపేందుకు ప్రతి శనివారం కమిషనరేట్‌కు రావొచ్చని సూచించారు.

రేపు మార్కెట్‌కు సెలవు

జనగామ: జిల్లా కేంద్రంలో దుర్గామాత జాతర సందర్భంగా ఈ నెల17వ తేదీన (గురువారం) జనగామ వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించడం జరిగిందని ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్తిదారులు దడువాయి, హమాలీ కార్మికుల కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. 18న యథావిధిగా మార్కెట్ సేవలు ఉంటాయన్నారు.

కనుల పండువగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

- దుర్గమ్మకు పుట్టమన్ను.. ఎల్లమ్మ తల్లికి ఘటం కుండ
- ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రత్యేక పూజలు

జనగామ: జిల్లా కేంద్రం బతుకమ్మకుంట విజయ దుర్గామాత జాతర ఉత్సవాలను పురస్కరించుకుని రెండో రోజు మంగళవారం రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. అమ్మవారికి పట్నం (పటం) వేసి... బోనం నైవేద్యం సమర్పించారు. అనంతరం ఒగ్గుపూజారుల ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణం నిర్వహించారు. అమ్మవారికి గావుపట్టి, పట్టణ ప్రజలు చల్లంగా ఉండేలా దీవించు తల్లీ అంటూ వేడుకున్నారు. అంతకు ముందు సాంప్రదాయం ప్రకారం గౌండ్ల (పెద్దగౌడ్) ఇంటి నుంచి ఘటం కుండ (కల్లు కుండ)ను శివసత్తుల పునకాలతో అమ్మవారి సన్నిధికి ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ తల్లికి ఓడిబియ్యం పోసి, కట్నకానుకలను సమర్పించారు. విజయదుర్గామాత అమ్మవారి చెంతకు పుట్ట మన్ను తీసుకువచ్చి, గద్దెల వద్ద నిర్మాణం చేశారు.

ఏసీపీ పరిశీలన

జాతర వేడుకలను పురస్కరించుకుని ఏసీపీ పార్థసారధి బతుకమ్మకుంటలో పరిశీలన చేశారు. నేడు బోనాల జాతర, అమ్మవారి ఊరేగింపు పురస్కరించుకుని వేలాది మంది భక్తులు, మహిళలు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

అమ్మవారిని దర్శించుకున్న డీసీసీ అధ్యక్షుడు

దుర్గామాత జాతర ఉత్సవాలను పురస్కరించుకుని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకోగా, వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. జాతర మూడోరోజు నేడు (బుధవారం) అమ్మవారి ఊరేగింపు చేయనున్నారు. ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం 6.30 గంటలకు బోనాల జాతర మొదలవుతుంది.



రేణుకా ఎల్లమ్మ చరిత్ర వినిపిస్తున్న ఒగ్గు పూజారులు



అమ్మవారికి బోనం సమర్పిస్తున్న మహిళలు



పూజల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, తదితరులు

క్లుప్తంగా

20న ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు

వరంగల్‌ స్పోర్ట్స్‌: హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్‌ జిల్లా స్థాయి జూనియర్‌ బాలబాలికల ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి తోట శ్యాంప్రసాద్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల ఎత్తు, బరువు, వయసు కలుపుకుని 250 పాయింట్లు దాటొద్దని, నవంబర్‌ 11, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు జేఎన్‌ఎస్‌లోని ఖోఖో స్టేడియం వద్ద ఆధార్‌, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో ఖోఖో కోచ్‌ రాజారపు రమేశ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయిలో పాల్గొంటుందని తెలిపారు.

పండుగకు వచ్చి ప్రాణం తీసుకున్నాడు..

- క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య
- మహబూబాబాద్‌లో ఘటన


సురేశ్‌(ఫైల్‌)

మహబూబాబాద్‌ రూరల్‌ : దసరా పండుగకు ఇంటికి వచ్చిన ఓ యువకుడు క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్‌ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్‌ సీఐ పెండ్యాల దేవేందర్‌ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని నందమూరి నగర్‌ కాలనీకి చెందిన మంజుల సురేశ్‌ (30), భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తెతో కలిసి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌ వెళ్లాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో దసరా సందర్భంగా ఇంటికి వచ్చాడు. పండుగ అనంతరం హైదరాబాద్‌ వెళ్దామని భార్య కల్యాణి చెప్పగా మద్యం మత్తులో ఉన్న సురేశ్‌ తరువాత వెళ్దామని చెప్పాడు. తల్లి సత్తెమ్మ, భార్య కల్యాణి.. మద్యం ఎందుకు సేవిస్తున్నావని మందలించగా, మీరు వెళ్లండి నేను తరువాత వస్తానని చెప్పాడు. దీంతో కల్యాణి తన కుమారుడు, కుమార్తెతో కలిసి హైదరాబాద్‌ వెళ్లడానికి రైల్వే స్టేషన్‌ చేరుకుంది. బయట ఉన్న తల్లి సత్తెమ్మ ఇంట్లోకి వచ్చి చూడగా సురేశ్‌ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై జోవెల్‌ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి శవ పంచనామా జరిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు

అద్దె చెల్లించలేదని గురుకులాల గేట్లకు తాళం | **భవనాల యజమానుల నిరసన**

తొర్రూరు/ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి/గూడూరు/రేగొండ/ఖిలావరంగల్‌/భూపాలపల్లి అర్బన్‌/ములుగు రూరల్‌: : గురుకులాల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో మంగళవారం మహబూబాబాద్‌ జిల్లా తొర్రూరు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర గురుకులం, మైనార్టీ బాలికల గురుకులం, నాంచారి మడూరులోని బీసీ బాలుర డిగ్రీ గురుకుల కళాశాల గేట్లకు యజమానులు తాళాలు వేసి నిరసన తెలిపారు. దీంతో విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆరుబయటే నిరీక్షించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 8 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించలేదని, పాఠశాల భవనాలకు నెలకు రూ.3 లక్షలు, కళాశాల భవనాలకు రూ. 4.50 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం అధికారుల హామీ మేరకు భవనాల యజమానులు గురుకులాల గేట్లు తెరిచారు.

- గూడూరు మండలంలోని మర్రిమిట్ట శివారు మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల విద్యాలయానికి మంగళవారం భవన సముదాయ యజమాని నితిన్‌ తాళం వేశారు. సమాచారం అందుకున్న గురుకుల విద్యాలయాల సెక్రటరీ.. వచ్చే నెల 4వ తేదీ లోపు అద్దె డబ్బులు చెల్లిస్తామని ఫోన్‌లో హామీ ఇచ్చారు.
- వరంగల్‌ జిల్లా ఖానాపురం మండలంలోని ఐనపల్లిలోని జ్యోతిరావుపూలే పాఠశాలకు యజమాని మంగళవారం తాళం వేశారు. దీంతో మధ్యాహ్నం వరకు ఉపాధ్యాయులు లోపలికి వెళ్లకుండా ఆగిపోయారు.


చెన్నారావుపేట : భవనానికి తాళం వేస్తున్న యజమాని కంది గోపాల్‌రెడ్డి

- దుగ్గొండి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల గేటుకు యజమానులు బైరెడ్డి రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తాళం వేశారు.
- దుగ్గొండి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల.. చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హైస్కూల్‌ భవనంలో కొన్నేళ్లుగా నడుస్తోంది. అంతేకాకుండా ఇందులోనే హాస్టల్‌ కూడా నడుస్తోంది. అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో భవనానికి తాళం వేసినట్లు యజమాని గోపాల్‌రెడ్డి తెలిపారు.
- జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని లింగాల మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్‌ భవనానికి 8 నెలలుగా అద్దె చెల్లించక పోవడంతో యజమానికి గేటుకు తాళం వేశారు.


గూడూరు: మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులానికి తాళం వేస్తున్న భవన యజమాని నితిన్‌

- అద్దె బకాయిలు చెల్లిచాలని డిమాండ్‌ చేస్తూ వరంగల్‌ ఉర్సు గుట్ట వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి తాళం వేశారు. దీంతో కళాశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు బయటే నిరీక్షించారు.
- జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలోని మైనారిటీ గురుకుల పాఠశాల గేట్‌కు భవన యాజమాని నాగుల దేవేందర్‌రెడ్డి తాళం వేశారు. ఉదయం 8గంటలకే తాళం వేయడంతో అధ్యాపకులు సాయంత్రం వరకు గురుకుల పాఠశాల ఎదుటే చెట్ల కింద వేచి ఉన్నారు. విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లారు.
- ములుగు మండలం మల్లంపల్లిలో అద్దెకు కొనసాగుతున్న ఏటూరునాగారానికి చెందిన గురుకుల పాఠశాలకు యజమాని తాళం వేశారు. సాయంత్రం వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారని పాఠశాల ప్రిన్సిపాల్‌ అంకయ్య తెలిపారు.

రామప్ప ఖ్యాతి ప్రపంచానికి చాటాలి

- కలెక్టర్‌ దివాకర టీఎస్‌
- ఆలయంలో వరల్డ్‌ హెరిటేజ్‌ క్యాంపెయిన్‌ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్‌ దివాకర టీఎస్‌

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని కలెక్టర్‌ దివాకర టీఎస్‌ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని రామప్ప దేవాలయ గార్డెన్‌లో వరల్డ్‌ హెరిటేజ్‌ క్యాంపెయినింగ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వ సంపదను భావితరాలకు అందించడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పనిచేయాలని పేర్కొన్నారు. 'వర్కింగ్‌ ఆన్‌ ది ఫ్యూచర్‌' అనే అంశంపై వరల్డ్‌ హెరిటేజ్‌ వలంటీర్స్‌–2024 క్యాంపెయిన్‌ను అక్టోబర్‌ 15 నుంచి 26 వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది వలంటీర్లతో పాటు ఉమ్మడి వరంగల్‌కు చెందిన మరో 40 మంది వలంటీర్లుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటకం, కాకతీయుల ఇంజనీరింగ్‌ ప్రతిభ, ఇతర అంశాలపై బోధన తరగతులతో పాటు ఫీల్డ్‌ ట్రిప్స్‌ ఉంటాయని, ఈ క్యాంపెయిన్‌ వలంటీర్లకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్‌ ట్రస్ట్‌ సభ్యుడు శ్రీధర్‌రావు, జిల్లా టూరిజం అధికారి శివాజీ, అసిస్టెంట్‌ ప్రమోషన్‌ అధికారి సూర్యకిరణ్‌, యోగా ఇన్‌స్ట్రక్టర్‌ రాంబాబు, గైడ్‌లు విజయ్‌కుమార్‌, వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్‌ టీమ్‌, పోలీసుల తనిఖీలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

కాజీపేట రూరల్‌: కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం యాంటీ డ్రగ్‌ టీమ్‌, కాజీపేట పోలీసులు సంయుక్తంగా నార్కోటిక్‌ డాగ్‌ సహాయంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌ ప్లాట్‌ఫాంలు, ప్రయాణికులు వేచి ఉండే గదులు, అనుమానాస్పద ప్రయాణికులు, వారి బ్యాగులను తనిఖీ చేశారు. ఈతనిఖీలో కాజీపేట సీఐ సుధాకర‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్‌, నవీన్‌, యాంటీ డ్రగ్స్‌ టీమ్‌ ఇన్‌స్పెక్టర్‌ జె.సురేశ్‌, ఆర్‌ఎస్సైలు పూర్ణచంద్రారెడ్డి, మనోజ్‌రెడ్డి, నాగరాజు, ఆర్‌ఐ శివకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడుశాతం రిజర్వేషన్‌ అమలు చేయాలి

- ఎమ్మెల్సీ అమీర్‌ అలీఖాన్‌


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అమీర్‌ అలీఖాన్‌

హన్మకొండ చౌరస్తా: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 3 శాతం రిజర్వేషన్‌ అమలు చేయడం వల్ల అనేక మంది ఉద్యోగాలు పొందారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ రిజర్వేషన్‌ అమలు చేయాలని ఎమ్మెల్సీ అమీర్‌ అలీఖాన్‌ అన్నారు. హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మైనారిటీ ఇంటలెక్చువల్‌ ఫోరం, ముస్లిం వెల్ఫేర్‌ సొసైటీ, అల్‌ ఫాయిజన్‌ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అమీర్‌ అలీఖాన్‌ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితుల కంటే ముస్లింలు సామాజికంగా, విద్యా రంగంలో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ముస్లిం సంక్షేమం కోసం కేవలం రూ.2వేల కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్‌ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో రూ.5వేల కోట్లు చేర్చిందని, త్వరలోనే ఆ నిధులు మంజూరయ్యేలా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. ప్రతీ పేద ముస్లింకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కేంద్రంలో కుర్చీ కోసం బీజేపీ సర్కార్‌ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. డాక్టర్‌ అనీసిద్దిఖీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర హజ్‌ కమిటీ చైర్మన్‌ ఖుస్రూపాషా, డాక్టర్‌ జమాలషరీఫ్‌, డాక్టర్‌ రజామాలిక్‌, ప్రొఫెసర్‌ ముస్తఫా, డాక్టర్‌ రాజ్‌మహ్మద్‌, సిరాజ్‌ అహ్మద్‌, నయిూమొద్దీన్‌, నస్రీన్‌ వాహిది, ఇస్మాయిల్‌ షంషీ, అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి వరంగల్‌ జిల్లా గాయకుల ఎంపిక


మాట్లాడుతున్న వరంగల్‌ శ్రీనివాస్‌

నయీంనగర్‌: 'నూరేండ్ల నా ఊరు' గేయం కోసం ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి గాయకులను ఎంపిక చేసి చారిత్రక పాటలో అవకాశం కల్పించనున్నట్లు కవి, గాయకుడు వరంగల్‌ శ్రీనివాస్‌ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ప్రెస్‌ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద సంవత్సరాల పల్లె చరిత్ర, మానవ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, మానవీయ విలువలు చాటి చెప్పేలా అప్పటి యాస, భాషతో కూడిన సాహిత్యాన్ని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో 243 చరణాలు కలిగిన గేయం రచించి దానిని 243 మంది గాయకులతో పాడిస్తామన్నారు. ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాల ఉంచి గాయకులను ఎంపికచేస్తామన్నారు. మొదట ఉమ్మడి వరంగల్‌ జిల్లా నుంచి ప్రారంభిస్తామన్నారు. రేపు (బుధవారం) కేయూ బైపాస్‌లోని శారదా ఫంక్షన్‌ హాల్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాయకుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కళాకారులు గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ, వెంకన్న, సునీల్‌, సంజీవ, మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్‌ : కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్‌, ఓరియంటేషన్‌ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు దూరవిద్య కేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డైరెక్టర్‌ వల్లూరి రామచంద్రం మంగళవారం తెలిపారు. ఈనెల 15వతేదీతో గడువు ముగియడంతో పెంపుదల చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చుని వివరించారు. మొత్తం 33 కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, జనరల్‌ కంప్యూటర్స్‌, బీబీఏ, బీఎస్సీ, బీఎల్‌, బీఎస్సీ, ఎం.ఏ తెలుగు, ఇంగ్లిష్‌, హిందీ, సంస్కృతం, పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌, పొలిటికల్‌ సైన్స్‌, ఎకనామిక్స్‌, హిస్టరీ, రూరల్‌ డెవలప్‌మెంట్‌, సోషియాలజీ, హెచ్‌ఆర్‌ఎం, ఎం.కామ్‌, సోషల్‌ వర్క్‌, జర్నలిజం అండ్‌ మాస్‌ కమ్యూనికేషన్‌, ఎమ్మెస్సీ సైకాలజీ, గణితశాస్త్రం, ఎన్విరాన్మెంటల్‌ సైన్స్‌, ఫిజిక్స్‌, కెమిస్ట్రీ, వృక్ష, జంతు శాస్త్రాలు, ఎంఎల్‌ఐఎస్సీ ఉన్నాయని తెలిపారు. అలాగే, డిప్లొమా కోర్సుల్లో కంప్యూటర్‌ అప్లికేషన్స్‌, గైడ్స్‌ అండ్‌ కౌన్సెలింగ్‌, యోగా, సర్టిఫికెట్‌ కోర్సులో సీఎల్‌ఐఎస్సీ, మిమిక్రీలో ఓరియంటేషన్‌ కోర్సుల్లోనూ ప్రవేశాలు పొందొచ్చన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఫొటో జత చేసి కోర్సు రుసుం ఆన్‌లైన్‌లో కాని దూర విద్య కేంద్రం ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్‌ కౌంటర్‌ నుంచి చలాన్‌ ద్వారా కాని చెల్లించొచ్చన్నారు. కోర్సులు, ఫీజులు వివరాలకు 0870–24611480,2461490 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆప్త మిత్రుడిని కోల్పోయాం..

- నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్‌ పార్టీ అండగా ఉంటుంది
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు
- మాజీ మంత్రి హరీశ్‌తోపాటు పలువురు బీఆర్‌ఎస్‌ నేతల నివాళి



నరేశ్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్‌, రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌, తదితరులు

మరిపెడ రూరల్‌: ఆప్త మిత్రుడు నూకల నరేశ్‌ రెడ్డిని కోల్పోయామని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఆయన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన దశ దిన కర్మలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేశ్‌ రెడ్డి కుమారులు అనిరుధ్‌రెడ్డి, అభినవ్‌రెడ్డిని మంత్రులు పరామర్శించారు. అనంతరం మంత్రులు పొంగులేటి, తుమ్మల మాట్లాడుతూ ఫ్యామిలీ రిలేషన్‌ కంటే కూడా వ్యక్తిగతంగా నరేశ్‌రెడ్డి తమకు ఆప్త మిత్రుడన్నారు. నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్‌ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌ డాక్టర్‌ జాటోతు రాంచంద్రునాయక్‌, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, భూక్య మురళీనాయక్‌, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్‌ రెడ్డి, ఘనపురపు అంజయ్య, వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్‌, గొడుగు శ్రీనివాస్‌, కాలం శ్రీనివాస్‌రెడ్డి, పానుగోతు రాంలాల్‌, గంధసిరి అంబరీష, మెంచ్‌ అశోక్‌, పటేల్‌ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నేతల ఘననివాళి..

నరేశ్‌రెడ్డి దశ దిన కర్మలకు బీఆర్‌ఎస్‌ పార్టీ మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌ రావు, సత్యవతి రాథోడ్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి వెంట రాజ్య సభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, డిప్యూటీ స్పీకర్‌ బండ ప్రకాశ్‌, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌ రావు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్‌ బిందు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్‌ రెడ్యానాయక్‌, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్‌ శంకర్‌నాయక్‌, మాజీ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్‌ కవిత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌, మాజీ ఓడీ ఎస్‌ఎంఎస్‌ చైర్మన్‌ కుడితి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సీపీఎం ఆధ్వర్యంలో నూకల నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్‌, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సోమయ్య, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ ధరణి కన్నుమూత

- చికిత్స పొందుతూ మృతి


ధరణి(ఫైల్‌)

నల్లబెల్లి/హసన్‌పర్తి: నల్లబెల్లి పోలీస్‌ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్‌ జోరుక ధరణి(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై ప్రశాంత్‌ బాబు కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన జోరుక రాజేశ్వరి, కుమారస్వామి దంపతుల కూతురు ధరణి నల్లబెల్లి పోలీస్‌ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పోలీస్‌ క్వార్టర్స్‌లో ఉంటోంది. తన ద్విచక్ర వాహనం కోసం తీసుకొచ్చిన పెట్రోల్‌ను గదిలో ఉంచింది. ఈ నెల 13న పెట్రోల్‌ బాటిల్‌ లీకేజీ కావడంతో గదిలో మంటలు వ్యాపించి ధరణికి అంటుకోగా బయటకు వచ్చింది. ఈ విషయం సహ మహిళా కానిస్టేబుల్‌ స్వర్ణకు చెప్పింది. అప్రమత్తమైన స్వర్ణ పోలీస్‌ ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ కాలిన గాయాలతో ఉన్న ధరణిని పెట్రో కార్‌లో ఎంజీఎంకు తరలించింది. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ధరణి మృతితో స్వగ్రామం పెంబర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి సోదరుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, 2020 బ్యాచ్‌కు చెందిన ధరణి.. పరకాల పోలీస్‌ స్టేషన్‌లో మొదటి పోస్టింగ్‌ పొందారు. అనంతరం 2022 సెప్టెంబర్‌లో బదిలీపై నల్లబెల్లి పోలీస్‌ స్టేషన్‌కు వచ్చారు.

వరంగల్‌ మార్కెట్‌లో అంతర్గత బదిలీలు

- ఖరీఫ్‌లో విధుల నిర్వహణ కోసమే మార్పులు
- ఖాళీ పోస్టులతో ఉన్న వారిపై అదనపు భారం


వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌ ప్రధాన కార్యాలయం

వరంగల్‌: ఏనుమాములలోని వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌ పరిధిలోని ప్రధాన కార్యాలయం, లక్ష్మీపురంలోని మోడల్‌ కూరగాయల మార్కెట్‌, పండ్ల మార్కెట్‌లో విధులు నిర్వర్తించే సూపర్‌వైజర్లు, ఏఎంఎస్‌, జేఎంఎస్‌లను పెద్ద ఎత్తున అంతర్గత బదిలీలు చేస్తూ మార్కెట్‌ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.శ్రీకాంత్‌(సూపర్‌వైజర్‌)కు అసెస్‌మెంట్‌ సెక్షన్‌ (ఎ టు ఎం), పర్చేజ్‌ రిటర్న్‌, మార్కెట్‌ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. వినయ్‌కాంత్‌ యూడీసీకి అసెస్‌మెంట్‌ సెక్షన్‌(ఎన్‌ టు జెడ్‌), పర్చేజ్‌ రిటర్న్‌, మార్కెట్‌ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. గంగాధర్‌(సూపర్‌వైజర్‌)కు కోల్డ్‌ స్టోరేజీలు, గోదాంల నిర్వహణ, వాచ్‌ అండ్‌ వార్డు ఇన్‌చార్జ్‌ విధులు అప్పగించారు. వి.స్వప్న (సూపర్‌వైజర్‌)కు కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్‌–1 సెక్షన్‌తో పాటు ధాన్యం, అపరాల యార్డు పూర్తి ఇన్‌చార్జ్‌ బాధ్యతలతో పాటు ఈ–నామ్‌ నిర్వహణ, రైతులకు లాట్‌ ఐడీల జారీ తదితర బాధ్యతలు అప్పగించారు. డి.లక్ష్మీనారాయణ(యూడీసీ)కు ధాన్యం, అపరాల యార్డు నిర్వహణ అప్పగించారు. మురళీయాదవ్‌(సూపర్‌వైజర్‌)ను లక్ష్మీపురం మోడల్‌ వెజ్‌ మార్కెట్‌ పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. సలీం(సూపర్‌వైజర్‌)ను పత్తి యార్డులో పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. చక్రబహదూర్‌ (సూపర్‌వైజర్‌)కు గ్రేయిన్‌ మార్కెట్‌లోని యార్డుల్లో దడవాయిలకు విధుల కేటాయింపు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, లైటింగ్‌ పర్యవేక్షణ అప్పగించారు. సాగర్‌(సూపర్‌వైజర్‌)కు అదనంగా మిర్చి యార్డు విధులు కేటాయించారు. డి.నర్సింహ(సూపర్‌వైజర్‌)కు పత్తి యార్డులో పూర్తి విధులు అప్పగించారు. జ్యోతి ప్రకాశ్‌ (సూపర్‌వైజర్‌)మార్కెట్‌ ప్రధాన కార్యాలయానికి వచ్చే లెటర్లు, దరఖాస్తులు ఇన్‌వార్డులో నమోదు చేసి కార్యదర్శికి, కార్యాలయం నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు పంపే లెటర్లు ఔట్‌ వార్డ్‌ నిర్వహిస్తారు. నర్సింగరావు(సూపర్‌వైజర్‌)కు ప్రధాన కార్యాలయంలో డిమాండ్‌ సెక్షన్‌, తక్‌పట్టీ సెక్షన్‌, బజారు సెక్షన్ల పూర్తి బాధ్యతలు అప్పగించారు. శ్రీనునాయక్‌(సూపర్‌వైజర్‌)కు లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌లో పూర్తి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. జి.వివేక్‌(జేఎంఎస్‌) పత్తి యార్డు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎం.రజిత(జేఎంఎస్‌) ప్రధాన కార్యాలయంలోని డిమాండ్‌, తక్‌పట్టీ సెక్షన్‌తో పాటు మిర్చి యార్డులో సహాయకులిగా అదనపు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

> **సీజన్‌లో ఇబ్బందులు లేకుండా..**
>
> 
>
> రానున్న ఖరీఫ్‌ సీజన్‌లో వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు సరుకుల కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యార్డుల్లో విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు నిర్వహించాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగానే అక్కడ విధులు నిర్వర్తించేందుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తాం.
>
> –పి.నిర్మల, మార్కెట్‌ ఉన్నత శ్రేణి కార్యదర్శి

ఉద్యోగులపై అదనపు భారం...

వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌ పరిధిలో అన్ని క్యాడర్లు గ్రేడ్‌–1, గ్రేడ్‌–2, యూడీసీ, అకౌంటెంట్‌, ఎల్‌డీసీ, గ్రేడర్‌, ఏఎస్‌లు, సూపర్‌వైజర్లు, ఏఎంఎస్‌, జేఎంఎస్‌లతో కలిపి 109 మంజూరు పోస్టులు ఉన్నాయి. ఇందులో 83 పోస్టులు ఖాళీ ఉండగా కేవలం 26 పోస్టుల్లో మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఖాళీలతో ప్రస్తుతం ఉన్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల యార్డుల్లో పర్యవేక్షణ కొరవడే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే మార్కెట్‌లో పర్యవేక్షణ పెరిగి రైతుల సరుకులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుందని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

వ్యక్తి పై కేసు నమోదు

ఖిలా వరంగల్‌ : చెల్లెపై దాడికి పాల్పడిన అన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్‌ తెలిపారు. శంభునిపేట విశ్వనాథ కాలనీలో పాలేపాక అరుణ నివాసం ఉండగా.. ఆమె అన్న మస్తాన్‌ వరంగల్‌ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. తన భార్యను తీసుకురావాలని మస్తాన్‌ తన చెల్లి అరుణ కోరాడు. దీనికి ఆమె నిరాకరించడంతో ఈనెల 12న దాడికి పాల్పడ్డాడు. అరుణ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్‌ తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

- మృతదేహాన్ని వెలికి తీసి కుటుంబికులకు అప్పగించిన పోలీసులు


చిరంజీవి (ఫైల్‌)

రామన్నపేట : ఓ వ్యక్తి కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్‌ డాక్టర్స్‌ కాలనీలో చోటు చేసుకుంది. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌ డాక్టర్స్‌ కాలనీలో నివాసముంటూ ప్రైవేట్‌ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న గజ చిరంజీవి(39) సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తన ఇంటికి సమీపంలోని క్వాలలో కాలుకు అంటుకున్న బురద కడుక్కునేందుకు అందులోకి దిగాడు. ఈ సమయంలో కాలు జారడంతో కొట్టుకుపోయాడు. సురేశ్‌ అనే వ్యక్తి దీనిని గమనించి చిరంజీవి కుటుంబ సభ్యులకు తెలిపాడు. కాగా, చిరంజీవి మృతదేహం గీసుగొండ మండలం బాలయ్యపల్లి బ్రిడ్జి వద్ద చిక్కుకోగా పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి మంగళవారం కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనపై మృతుడి భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్‌ తుమ్మ గోపి తెలిపారు.

కళాక్షేత్రానికి ఉర్దూభాష నేమ్‌ప్లేట్‌ బిగింపు



సాక్షి స్పందన

న్యూశాయంపేట : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రానికి రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూ నేమ్‌ప్లేట్‌ను బిగించారు. కాగా, కాళోజీ కళాక్షేత్రం పేరు ఉర్దూలో కూడా లిఖించాలని ఆ భాషాభిమానులు, కళాకారులు, కవులు డిమాండ్‌ చేస్తున్నారు. ఈ అంశంపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు కాకతీయ అర్బన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ (కుడా) అధికారులు స్పందించారు. మంగళవారం కళాక్షేత్రం ఎదుట ఉన్న గ్రిల్స్‌కు తాత్కాలికంగా ఉర్దూ భాషలో లిఖించిన నేమ్‌ప్లేట్‌ బిగించారు. కాగా, పర్మనెంట్‌గా బిల్డింగ్‌ పై భాగంలో రేడియం అక్షరాలతో ఉర్దూ నేమ్‌ప్లేట్‌ ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్‌ మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహ్మద్‌ నయీం డిమాండ్‌ చేశారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి



జనగామ: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. కలెక్టర్ రిజ్వాన్ బాషాను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టర్‌తో కొమ్మూరి మాట్లాడారు. ఆయన వెంట టీపీసీసీ మెంబర్ చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రపంచ కరాటే పోటీలకు ఎంపికైన ఆదిత్య



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్ గ్రామానికి చెందిన పొన్న వేణు, కోమలత దంపతుల కుమారుడు, 8వ తరగతి విద్యార్థి పొన్న ఆదిత్య ఎఫ్ఎస్‌కేపీ వరల్డ్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. నవంబర్ 7 నుంచి 10వ తేదీ వరకు గోవాలోని పెడ్డెం ఇండోర్ స్టేడియంలో జరిగే ప్రపంచ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఆదిత్య ఎంపికయ్యాడు. తమ కుమారుడు ప్రపంచ కరాటే పోటీలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆదిత్యకు పాంనూర్ గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్పీడీసీఎల్ ఘన్‌పూర్ డీఈగా వై.రాంబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఘన్‌పూర్ డీఈగా పనిచేస్తున్న ఎం.హుస్సేన్‌నాయక్ ఆగస్టు 31న ఏసీబీకి పట్టుబడగా గడ్డం గణేశ్ ఇన్‌చార్జ్ డీఈగా విధులు నిర్వహించారు. కాగా, హనుమకొండ విద్యుత్‌భవన్‌లో మెటీరియల్ మెయింటనెన్స్ విభాగంగా డీఈగా పనిచేసిన రాంబాబు ప్రస్తుతం ఘన్‌పూర్ డీఈగా బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈని డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించారు.

చర్య తీసుకోవాలి

చిల్పూరు: తండ్రి బోళ్ల బాలయ్య పేర ఉన్న వ్యవసాయ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న తన భార్య స్వప్న అలియాస్ నక్కల రజితపై చర్య తీసుకుని పట్టా పాస్‌బుక్కును రద్దుచేసి తమకు న్యాయం చేయాలని బోళ్ల రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్క, రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు.

ఎల్లమ్మగడ్డ తండాను పంచాయతీగా ఏర్పాటు చేయాలి

పాలకుర్తి: మండలంలోని ఎల్లమ్మగడ్డ తండాను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని తండా వాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను తండా వాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. పంచాయతీగా ఏర్పాటు చేయాలని మంత్రికి వినతిపత్రం సమర్పించారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. స్థానికులు బానోతు రమేష్, చిన్న రమేష్, రాజ్‌కుమార్, రజనీకాంత్, శ్రీను, లూనావత్ సురేష్, సునీల్ ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



నర్మెట: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అమ్మాపురం పిట్టలగూడెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గూడెంకు చెందిన గుజరాతి లక్ష్మయ్య (20) సోమవారం సాయంత్రం కెనాల్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన గ్రామస్తులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. అయితే రెండేళ్లుగా ప్రేమిస్తున్న బంధువుల అమ్మాయి పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన పంగ సాంబరాజు (32) మంగళవారం కుటుంబ కలహాలతో హైదరాబాదులోని ఇంట్లో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చిల్పూరుకు చెందిన సాంబరాజు హైదరాబాద్‌లో ప్రైవేట్ వాహన డ్రైవరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల భార్యతో గొడవ జరగడంతో ఆమె వెళ్లి పోయింది. దీంతో మనస్థాపానికి గురైన అతను ఆత్మహత్య చేసుకున్నాడు.

ఓపీకే పరిమితం

- సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పూర్తిస్థాయిలో అందని వైద్యసేవలు
- సిబ్బంది కొరతతో ఉపయోగంలో లేని వైద్య పరికరాలు





సామాజిక ఆరోగ్య కేంద్రం (ఇన్‌సెట్‌లో) నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరం

జఫర్‌గఢ్: మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందు కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీనీ వైద్య సేవలు మాత్రం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. వైద్య చికిత్సకు సంబంధించిన పలు పరికరాలను ఆస్పత్రిలో ఏర్పాటు చేసినప్పటికీ సంబంధిత సిబ్బంది లేక నిరుపయోగంగా ఉంటున్నాయి. దీంతో వైద్య సేవలు కేవలం ఓపీకి మాత్రమే పరిమితం కావడంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలోనే మొట్టమొదటి ప్రాథమిక అరోగ్య కేంద్రంగా పేరొందిన జఫర్‌గఢ్ పీహెచ్‌సీని గత ఐదేళ్ల క్రితం ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది. కొత్త భవనాన్ని కూడా నిర్మించి నిపుణులైన వైద్యులు, సిబ్బందిని నియమించింది. దీంతో పాటు ఆస్పత్రిలో ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ఈసీజీ తదితర వైద్య పరికరాలను కూడా ఏర్పాటు చేసింది, కానీ వాటిని ఆపరేట్ చేసే సిబ్బందిని మాత్రం నియమించలేదు. దీంతో అన్ని ఉన్నా అల్లుడి నోట్లే శని అన్న చందంగా ఆస్పత్రి పరిస్థితి ఉంది. ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌కు సంబంధించిన రేడియాలజిస్ట్, అనస్థీషియా, రేడియోగ్రాఫర్, ఆపరేషన్ థియేటర్ స్టాఫ్‌ను ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదు. దీనివల్ల వీటికి సంబంధించిన వైద్య పరీక్షలతో పాటు ప్రసూతిలకు సంబంధించిన ఆపరేషన్లు నిర్వహించడం లేదు. కేవలం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు మాత్రమే నిర్వహిస్తుండడంతో ఆస్పత్రి పేరుకే పెద్ద ఆస్పత్రిలా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత వైద్య సిబ్బందిని నియమించి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకరావాలని స్థానికులు కోరుతున్నారు.

వైద్యసిబ్బందిని నియమించాలి



జఫర్‌గఢ్ సామాజిక అరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే, స్కాన్ తదితర వైద్య పరికరాలు ఉన్న సిబ్బంది లేక అవి నిరుపయోగంగా ఉంటున్నాయి. వీటి కోసం రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైన సరిపడ వైద్య సిబ్బందిని వెంటనే నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

– ఉల్లి శివరాజు, వడ్డెగూడెం

నిరుపయోగంగా వైద్య పరికరాలు



ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేసేందుకు ఎక్స్‌రే, స్కాన్, ఆపరేషన్ థియేటర్ ఉన్నా రోగులకు ఉపయోగపడం లేదు. వీటికి సంబంధించిన వైద్య సిబ్బంది లేకపోవడంతో పరీక్షల కోసం వచ్చే వారిని వైద్యులు ఇతర ఆస్పత్రులకు పంపిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వైద్య పరికరాలను రోగులకు అందుబాటులో తెచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– మొట్టక ఎల్లయ్య, జఫర్‌గఢ్

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం



దేవరుప్పుల: మాట్లాడుతున్న భాస్కర్



జఫర్‌గఢ్: అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

దేవరుప్పుల: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కాలం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యాభివృద్ధిలో రాణిస్తూ తాము కన్న కలలు సాకారం చేసుకోవాలనే కలాం ఆశయసాధన స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. దేశ పురోగతి కోసం ఉన్నత విద్యలో శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ అరుణాకర్, అధ్యాపకులు రాధిక, చైతన్య, అనురాధ, వెంకటేశ్వర్లు, శశిధర్, ఉదయ్ కుమార్, భవాని, మహేష్, శ్రీనివాస్, ఆదర్శ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూనూర్‌లో..

జఫర్‌గఢ్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల హెచ్‌ఎం ఎండీ పర్వేజ్ మాట్లాడుతూ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవసన్నిధిలో మానసిక ప్రశాంతత



అమ్మవారికి పూజ చేస్తున్న దయాకర్‌రావు

కొడకండ్ల: దైవసన్నిధిలోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ప్రతి ఒక్కరు భక్తిభావాన్ని అలవర్చుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని యోగలింగేశ్వర సహిత రాజరాజేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న శరత్కాల మహోత్సవాల్లో దయాకర్ రావు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించి ఆశీర్వచనం పొందారు. అనంతరం వేదపండితుడు పాలకుర్తి సుధాకరగౌతంశర్మ–అంజనీదేవి దంపతులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాము, సొసైటీ వైస్ చైర్మన్ సోమరాములు, నాయకులు వెంకటనారాయణ, మంగ్యానాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

సీఎం కప్ ర్యాలీని విజయవంతం చేయండి

జనగామ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న సీఎం కప్–2024లో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడాకారులు పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడాజ్యోతి ర్యాలీ నిర్వహిస్తుందని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి బి.వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నేడు(బుధవారం) హనుమకొండ జిల్లా నుంచి జిల్లాలోకి క్రీడా జ్యోతి ర్యాలీ ప్రవేశిస్తుందని, సాయంత్రం 4 గంటలకు యశ్వంతపూర్ బ్రిడ్జి వద్ద ఎల్లమ్మగుడి నుంచి జనగామ చౌరస్తా వరకు క్రీడాజ్యోతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులు, యువత, క్రీడా సంఘాల సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చేయూత



పాలకుర్తిటౌన్: మెడిసిన్‌లో సీటు సాధించిన నియోజకవర్గ పరిధిలోని బురహాన్‌పల్లి గ్రామానికి చెందిన పేద విద్యార్థి బాలె రమ్యకు వీఆర్ ఫౌండేషన్ ఆర్థిక చేయూత అందించింది. మండల కేంద్రంలో విద్యార్థికి వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి యాకయ్యగౌడ్ రూ.10 వేల సాయం అందజేశారు. రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, ఎంఈఓ నర్సయ్య పాల్గొన్నారు.

నేడు నిజామాబాద్‌లో ఎమ్మార్పీఎస్ సదస్సు



మాట్లాడుతున్న ఉపేందర్

జనగామ: నేడు(బుధవారం) నిజామాబాద్‌లో తలపెట్టిన ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీ కరణ లేకుండానే టీచర్ ఉద్యోగాలను భర్తీ చేసి తమకు నమ్మక ద్రోహం చేశారన్నారు. మాదిగ జాతికి ఉద్యోగాలు రాకుండా కుట్రలు పన్నుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ప్రత్యక్ష యుద్ధానికి జాతి సిద్ధం కావాలని కోరారు. మాలల ఒత్తిడికి తలొగ్గి సుప్రీం కోర్టు తీర్పును సైతం ధిక్కరిస్తూ దగా చేస్తున్నారని మండిపడ్డారు. తమ జాతిని ఏకం చేసేందుకు నిజామాబాద్ వేదికగా భవిష్యతుత కార్యాచరణ ప్రకటించబోతున్నామన్నారు. ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల మహేష్, తుర్కపల్లి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

5 కిలోల కణితి తొలగింపు



కణితితో రాజమౌళి

జనగామరూరల్: మహిళ కడుపులోంచి ఆపరేషన్ చేసి 5 కిలోల 100 గ్రాముల కణితిని వైద్యులు తొలగించిన సంఘటన జిల్లా కేంద్రంలోని రవళి నర్సింగ్‌హోమ్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఆస్పత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడకండ్ల మండలంలోని మొండ్రాయికి చెందిన ఇటుకల సబిత(47) కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని నర్సింగ్‌హోమ్‌లో వైద్య పరీక్షల కోసం వచ్చింది. దీంతో డాక్టర్ రాజమౌళి మహిళకు వైద్యపరీక్షలు స్కానింగ్, ఎక్స్‌రే తీసి కణితి ఉందని గుర్తించి ఆపరేషన్ చేయాలని తెలిపారు. కాగా, సబిత అంగీకరించడంతో డాక్టర్ రాజమౌళి నేతృత్వంలో వైద్యులు ఆపరేషన్ చేసి కడుపులోని కణితిని తీశారు. ఈ ఆపరేషన్‌లో మోర్తాల ప్రభాకర్, అల్లిసేరి శ్రీనువాస్, అల్వాల రమేశ్, కుంట మల్లేష్, సిస్టర్ సరోజన పాల్గొన్నారు. కాగా, అపరేషన్ విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ రాజమౌళితో పాటు సిబ్బందిని పలువురు అభినందించారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి



నర్మెట: టీకా వేస్తున్న నేహ

నర్మెట: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు విధిగా వేయించాలని మండల పశువైద్యాధికారి నేహ సర్పట్‌వార్ అన్నారు. మండలంలోని ఇప్పలగడ్డలో మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో 192 పశువులకు టీకాలు వేసిన సందర్భంగా రైతులకు ఆమె పలు సూచనలు చేశారు. గాలి కుంటు వ్యాధితో పాడి ఉత్పత్తి తగ్గిపోతుందని, కాడెద్దుల్లో ఆరోగ్యం క్షీణిస్తుందని రైతులు నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. జేవీఓ సుభద్ర, సిబ్బంది శివనాగరాజు, అనిల్, పవన్, పంచాయతి కార్యదర్శులు ప్రశాంత్, కీర్త, వినయ్ కుమార్, కారోబార్ యాట కనకరాజు, రైతులు బానోత్ బల్‌రాం పాల్గొన్నారు.

వ్యాధి నివారణ టీకాలను వినియోగించుకోండి

లింగాలఘణపురం: పశువుల్లో సోకే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారిణి అనిత కోరారు. మండల కేంద్రంలో పశువులకు టీకాలను వేసి మాట్లాడారు. కార్యక్రమంలో పాల కేంద్రం చైర్మన్ మేడ తిరుమల్, సిబ్బంది శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే ‘కళా ఉత్సవ్’

జనగామ రూరల్: విద్యార్థుల్లో వివిధ కళా నైపుణ్యాల ప్రతిభను వెలికి తీసేందుకు కళా ఉత్సవ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాము తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్‌టీ రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీలను ఈనెల 17,18తేదీల్లో జనగామలోని ఏకశిలా బీఈడీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం థియేటర్ (నాటకం), దృశ్యకళ, సంప్రదాయక కథలు చెప్పడం వంటి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనేలా హెచ్‌ఎంలు కృషి చేయాలన్నారు.

సామాజిక కార్యక్రమాలకు చేయూత అవసరం



గొడుగులు అందుకున్న విద్యార్థులతో వీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

పాలకుర్తి: సామాజిక కార్యక్రమాలకు చేయూత అవసరమని వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి యాకయ్యగౌడ్ అన్నారు. వీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గొడుగులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు రమేష్, బలరాం, నరసింహమూర్తి, అశోక్, వెంకటయ్య, సోమయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉత్తములకు సత్కారం

జనగామ: బతుకమ్మ, దసరా పండుగ సమయంలో టికెట్ కలెక్షన్లను పెంచడంలో అంకిత భావంతో పని చేసిన కండక్టర్లు, డ్రైవర్లు, మెయింటెనెన్స్, ట్రాఫిక్ విభాగం, ఆఫీస్ సిబ్బంది, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, అద్దె బస్సు కార్మికుల సమష్టి కృషిని అభినందిస్తూ డిపో మేనేజర్ స్వాతి మంగళవారం వారిని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో డిపోకు మరిన్ని లాభాలు తీసుకు వచ్చే విధంగా పని చేయాలని కోరారు.

పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరిచే సంక్షేమ అభివృద్ధి పథకాలను అర్హులకు అందించేందుకు తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో ఐదుగురికి ప్రాతినిధ్యం కల్పిస్తూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సూచనల మేరకు మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు పర్యవేక్షణలో పలు గ్రామాల్లో కమిటీలను ఎన్నుకున్నారు. మండలంలోని కామారెడ్డిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులుగా నారెడ్డి నర్సింహరెడ్డి, చింత ఉపేందర్, మహమ్మద్ షబ్బీర్, చింత రేణుక, ఓడపల్లి రమలను ఎన్నికయ్యారు. అలాగే చిప్పరాళ్లబండ తండాలో బానోత్ శ్రీను, భూక్య లక్‌పతి, దాసర్ల సమ్మయ్య, ధారావత్ స్వరూప, సునీత, ధర్మగడ్డతండాలో వాంకుడోత్ యాకు, ఎర్రబెల్లి మమత, పంగ వెంకన్న, మూడు సోమన్న, భూక్య కవిత ఎన్నికయ్యారు. కాగా కడవెండిలో రెండు కమిటీలు వేసుకోని సోషల్ మీడియాలో వైరల్ చేయడం చర్చంశానీయంగా మారింది.

అందరి నిర్ణయంతోనే..

చిల్పూరు: గ్రామాల్లో అందరి నిర్ణయంతోనే ఇందిరమ్మ గ్రామ కమిటీలను వేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం గ్రామ కమిటీల నియామకంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కడా ఆరోపణలు రాకుండా కమిటీలను వేయడం జరిగిందన్నారు.

ఆదర్శ యువ మండలి కార్యవర్గం ఎన్నిక

దేవరుప్పుల: మండలంలో పేరేన్నిక గల ఆదర్శ యువ మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కారుపోతుల సందీప్, భోనగిరి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగవారం మండలంలోని పెద్దమడూరులో ఆదర్శ యువ మండలి ప్రాంగణంలో జరిగిన నూతన కార్యవర్గ ఉపాధ్యక్షుడిగా సంగి చంద్రశేఖర్, క్రీడా విభాగం కన్వీనర్‌గా ఆకవరం రాజు, సాంస్కృతిక ఇన్‌చార్జ్‌గా కర్రె అశోక్‌తోపాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పాత కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి స్వాగతం పలికారు.

నియామకం

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన కోత్వాల కుమార్ బీఆర్‌ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ తనను నియమించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్యతో పాటు నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్: రాఘవాపూర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బత్తిని దశరథం మంగళవారం ప్రారంభించారు. శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

సన్మానం

కొడకండ్ల: డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికైన గిర్నితండాకు చెందిన ధరావత్ రాజును మంగళవారం స్వగ్రామంలో గిరిజన నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టుదలతో చదివి 85వ ర్యాంకును రాజు సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపికవడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మార్కెట్ చైర్‌పర్సన్‌కు...

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డిని సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మండలంలోని రంగరాయగూడెంలో ఆమె నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. నాయకులు మల్లారెడ్డి, రాజు, పరమేష్, ఐలయ్య, రాజు పాల్గొన్నారు.


అభినందనీయం

దేవరుప్పుల: రైతుల సంక్షేమం కోసం ఏఈ రాజవర్ధన్‌రెడ్డి నిరంతరం మెరుగైన విద్యుత్ సేవలు అందించడం అభినందనీయమని మాజీ వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని సింగరాజుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ రాజవర్ధన్ రెడ్డి బదిలీపై జనగామకు వెళ్తున్న క్రమంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

ప్రజల సంక్షేమానికి పెద్దపీట

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను దశల వారీగా నెరవేరుస్తోందని తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల



పాఠశాల ఆవరణలో ఖాళీ బీరు సీసాలు



పడవేసిన చెత్తాచెదారం

- సెలవులొస్తే మద్యం తాగుడే

చిల్పూరు: సెలవులు వస్తే మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారుతోంది. ఇటీవల దసరా సెలవులు రావడంతో పాఠశాల గేటుకు తాళం వేశారు. గుర్తు తెలియని వారు పాఠశాల గేటు తాళం పగుల గొట్టడంతో పాటు రోడ్డు పక్కన ఉన్న కాల్వలో వెళ్లే మురుగు నీటిని పాఠశాల ఆవరణలోకి వెళ్లేలా చేయడం, ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ తాగిన మద్యం సీసాలను పడేశారు. వంట గది సమీపంలో ఉన్న నల్లా పైపులను విరగొట్టి అక్కడా ఖాళీ సీసాలను పగులగొట్టారు. చెత్తాచెదారాన్ని పాఠశాల ఆవరణలో వేశారు. సెలవుల అనంతరం మంగళవారం హెచ్‌ఎం సరోజన గేటు తాళం తీసేందుకు చూడగా పగుల గొట్టి ఉండడంతో విద్యార్థులతో పాటు పాఠశాల ఆవరణలోకి వెళ్లగా చెత్తా చెదారంతో నిండిపోయింది. వెంటనే పంచాయతీ కార్యదర్శి పెళ్లి హరిప్రసాద్‌కు తెలుపగా సిబ్బందితో శుభ్రం చేయించాడు. ఇప్పటికైనా పాఠశాల ఆవరణను అపరిశుభ్రం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



మురుగు నీటితో నిండిన పాఠశాల ఆవరణ

గోవర్ధనగిరిలో..



ఉన్నత పాఠశాలలో తాగి పడేసిన బీరు సీసాలు

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో మందుబాబులు రెచ్చిపోతున్నారు. ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని భవనాల్లో నిత్యం మద్యం సేవిస్తున్నారు. రాత్రి అయ్యాక ఇష్టారాజ్యంగా మద్యం తాగుతు సీసాలు అక్కడే వదిలేస్తున్నారు. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సార్లు సీసాలు పగులగొడుతుండడంతో విద్యార్థులు గాయాల పాలవుతున్నారు. శుభ్రపర్చేందుకు పాఠశాల సిబ్బందీ ఇబ్బంది పడుతున్నారు. కొందరు మద్యం ప్రియులు ఉన్నత పాఠశాలతో పాటు ఆ పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సిట్టింగ్ సెంటర్లుగా మార్చారు. స్థానికులు అభ్యంతరం తెలిపినా.. పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



తవ్వకాలు చేపడుతున్న ఎస్సై

జఫర్‌గఢ్: ఆకేరు వాగులోంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని స్థానిక ఎస్సై రామ్‌చరణ్ హెచ్చరించారు. మండలంలోని తిడుగు ఆకేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించకుండా దారికి అడ్డంగా పొక్లెయినర్ ద్వారా ఎస్సై సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి తవ్వకాలు చేపట్టి మాట్లాడారు. వాగులోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే ఈ ప్రాంత రైతుల బోర్లలో నీటిమట్టం తగ్గే ప్రమాదం ఉందన్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.